క్లుప్తంగా

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు గురుకుల విద్యార్థి పద్మ ఎంపిక



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్‌కు చెందిన బీకామ్ థర్డ్ ఇయర్ విద్యార్థిని మంగళపల్లి పద్మ.. నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఈమేరకు కళాశాల ఆవరణలో ఆమెను ప్రిన్సిపాల్ తోపాటు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాధిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



కాజీపేట అర్బన్: ప్రతీ పౌరుడు పౌర హక్కులపై అవగాహన కలిగిఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ అన్నారు. కాజీపేట మండలంలోని తరాలపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ సమాజంలో పౌరులు స్వేచ్ఛగా జీవించేందుకు పౌర హక్కులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోజ్‌కుమార్, తరాలపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం అరుణ, ఆర్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు అభినందన



మడికొండ: మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ నర్సింగ్ విద్యార్థులు 31మందికి అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రాంగణం మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా వారిని మేనేజర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

అమ్మవారి సన్నిధిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ముందుగా గోశాలలో గోవులకు గ్రాసం తినిపించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన భీమారానికి చెందిన సంగాల కిషన్ కుటుంబానికి మృతుడి బాల్యమిత్రులు చేయూతనిచ్చారు. ఈమేరకు 1994 – 95 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన వారు రూ.75 వేలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఓదెల నరేందర్, చింతల రామకృష్ణ, చంద్రశేఖర్, అటికం రవీందర్ పాల్గొన్నారు.

పాల కేంద్రంలో రూ.30 వేలు చోరీ

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి వాటర్ ట్యాంక్ సమీపంలోని ఓ పాల విక్రయ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తి రూ.30 వేలు చోరీ చేశాడు. బాధితుడి కథనం ప్రకారం గుడిమల్ల చంద్రశేఖర్ కొంతకాలంగా పాల వ్యాపారం చేస్తున్నాడు. డబ్బులు టేబుల్ డ్రాలో భద్రపరిచి పాల ప్యాకెట్లను వినియోగదారులకు అందించడం కోసం వెళ్లి వచ్చేసరికి డబ్బులు మాయం అయ్యాయి. శుక్రవారం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

సీపీఆర్‌పై డ్రైవర్లకు అవగాహన



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఆటో, బైక్ ట్యాక్సీ, ర్యాపిడో డ్రైవర్లకు సీపీఆర్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో గుండె నొప్పి వస్తే చేయాల్సిన సీపీఆర్‌పై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని వైద్యుడు రాజేంద్రప్రసాద్ సూచించారు.

బ్రిడ్జి నిర్మాణంతో నేలకూలిన రైతుబజారు

- కాజీపేట ఫాతిమానగర్‌లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- దృష్టి సారించాలని వ్యాపారుల వేడుకోలు



నాడు.. బ్రిడ్జి కింద రైతు బజారులో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు



నేడు.. రైతుబజారు ఎత్తివేయడంతో రోడ్డుపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

కాజీపేట: ఫాతిమానగర్ బ్రిడ్జి కింద రెండు దశాబ్దాల కాలం క్రితం ఏర్పాటు చేసిన రైతు బజారును అధికారులు తొలగించి బ్రిడ్జి నిర్మాణ పనులను మొదలుపెట్టారు. ప్రజలకు నాణ్యతతో కూడిన కూరగాయలను అందించడంతో పాటు అన్నదాతలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రైతు బజార్లను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రజలకు కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులను చౌక ధరలకే లభించేలా ఏర్పాట్లు చేశారు. రైతుబజారుపై ఆధారపడి చాలామంది ఉపాధి పొందారు. కాగా, అయిదున్నర ఏళ్లుగా రైల్వే లైన్‌పై రెండో సమాంతర బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండంతో రైతు బజారు ఏర్పాటు పనులు అటకెక్కాయి. ఫాతిమానగర్ వైపు పనులు చేపట్టాలనే ఉద్దేశంతో ఆర్అండ్‌బీ అధికారులు రైతుబజారును తొలగించారు. రైతు బజారుపైనే ఆధారపడి చాలాకాలంగా బతుకులు ఈడుస్తున్న వ్యాపారులు, ఉద్యోగస్తులు రోడ్డున పడ్డారు. కూల్చివేసిన వెంటనే సంబంధిత అధికారులు మరోచోట ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. నాడు బ్రిడ్జి, పచ్చని చెట్ల నీడల్లో అమ్మకాలు సాగించిన వ్యాపారులు.. నేడు రోడ్లపై అమ్మకాలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య స్పందించి రైతుబజారుపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అమ్మకందారులతో పాటు కొనుగోలుదారులు కోరుతున్నారు.

‘ప్రభుత్వరంగ సంస్థల విధ్వంసం’



మాట్లాడుతున్న వీరస్వామి

న్యూశాయంపేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలను విధ్వంసం చేస్తూ కార్పొరేట్ రంగానికి పాలకులు పెద్దపీట వేస్తున్నారని అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామి విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి భిక్షపతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ అధ్యయన తరగతుల్లో వీరస్వామి మాట్లాడారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రవేటీకరణ కారణంగా పేద, ధనిక మధ్య తారతమ్యాలు పెరుగుతున్నాయని వాపోయారు. ఇది మానవ అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా భావించాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం, న్యాయం ప్రభుత్వ రంగాల్లోనే కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, శ్రీనివాస్, లింగారెడ్డి, ఎల్లేష్, లక్ష్మణ్, సంతోష్, రాజు, సారంగపాణి, శ్యాంసుందర్, శంకర్‌నాయక్, వెంకటేశ్, ప్రణీత్, రాజయ్య, చరణ్, రవితేజ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు



ప్లాస్టిక్ వ్యర్థాలు నింపిన బాటిళ్లతో చిన్నారులు

హన్మకొండ: పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ముందుకొచ్చారు. నిత్యం వారి ఇళ్లల్లో ఉపయోగించి పాలు, పెరుగు, వంట నూనెలు, ఇతర అవసరాలకు వినియోగించే ప్లాస్టిక్ కవర్లను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా ప్లాస్టిక్ బాటిల్‌లో నింపి పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించాలని తెలుపుతూ పలివేల్పుల పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లు నింపిన బాటిళ్లను శుక్రవారం ప్రదర్శించారు. తద్వారా ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినకుండా నివారించినట్లవుతుందని, కాలుష్యాన్ని కూడా కట్టడి చేసినట్లవుతుందని అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెనిశెట్టి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు తట్టిన ఈ ఆలోచన ఎంతో గొప్పదన్నారు.

జాతీయ క్రీడలకు ఎల్‌బీ విద్యార్థి ఎంపిక



శాలినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రామన్నపేట: ఉత్తరాఖండ్‌లో ఫిబ్రవరి 7 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న 38వ జాతీయ క్రీడలకు నగరంలోని ఎల్‌బీ కళాశాలలో సీఈసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి ధనుర్కర్ శాలిని ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున నెట్‌బాల్ క్రీడకు శాలిని ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు. ప్రతీ రెండేళ్లకు ఒకసారి నిర్వహించే జాతీయ క్రీడల్లో శాలిని ఎంపిక కావడంతో కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు చైర్మన్ ప్రొఫెసర్ భాగ్యనారాయణ, సెక్రటరీ, కరస్పాండెంట్ వినయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.రాజేందర్‌రెడ్డి, ఇంటర్మీడియట్ కోఆర్డినేటర్ ఎం.సదానందం, ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, గేమ్స్ కమిటీ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, మధుకర్‌రావు, సుధాకర్, సుచిత్ర, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



దామెర: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి కొనియాడారు. హనుమకొండ జిల్లా దామెర మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సంగ రామమూర్తి శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేయగా, రామమూర్తి – లక్ష్మీజ్యోతి దంపతులను తహసీల్దార్ హాజరై సన్మానించారు. ఎంఈఓ లకావత్ రాజేష్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ, సంగ నీలకంటేశ్వర్, రవీన, పాడిశెట్టి శ్రుతి, శ్రీనివాస్, రాపర్తి శ్రావణి, ప్రణీత్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో నియామకాలు చేపట్టాలి



సీఎంకు కృతజ్ఞతలు తెలిపే లేఖను విడుదల చేస్తున్న సంఘం బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అధ్యాపకుల నియామకాలు చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం (అకుట్) జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ల వయోపరిమితి 60 ఏళ్ల వయస్సు నుంచి 65 ఏళ్లకు పెంచడంపై అకుట్ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. కాకతీయ యూనివర్సిటీలో అకుట్ పాలకమండలి సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రొఫెసర్ల వయో పరిమితిని పెంచడంపై సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన కృతజ్ఞత లేఖను విడుదల చేశారు. సమావేశంలో అకుట్ సంయుక్త కార్యదర్శి డాక్టర్ కిశోర్‌కుమార్, కోశాధికారి ప్రొఫెసర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ రాంచంద్రం, ప్రొఫెసర్ రాజేందర్, ప్రొఫెసర్ నాగరాజు, ప్రొఫెసర్ కుంట అయిలయ్య పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సన్మానం



రామన్నపేట: పదవీ విరమణ పొందిన అధ్యాపకుడిని విద్యార్థులు సన్మానించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సివిల్ విభాగం అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించిన మహ్మద్ హైదర్ అలీఖాన్ సన్మాన సభ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు వెంకన్న, శ్రీనివాస్, రవీందర్, సుధ, శ్రీనివాస్, మోతీలాల్ పాల్గొన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు నివాళి



హసన్‌పర్తి: నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

రామన్నపేట: ప్రజాకవి గద్దర్ జయంతి వేడుకలను బీబి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ జడల శివ ఆధ్వర్యంలో నగరంలోని గోపాలస్వామి గుడి సెంటర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్కెస్ట్రా సింగర్ రాము, సకల కళా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు గడ్డం సుధాకర్, మధుసూదన్, హాస సంస్థ అధినేత గజ్జి దివాకర్, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి ముచ్చర్లలో..

హసన్‌పర్తి: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతి వేడుకలు ఒకటవ డివిజన్ ముచ్చర్లలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్ రెడ్డి, చిర్ర రాజేష్, శ్రవణ్, భిక్షపతి, సతీష్, కుమార్‌రెడ్డి, వెంకటేష్, గోపి, రాము, హరీశ్, సుభాష్, జగన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలి



హన్మకొండ: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఫిబ్రవరి 2న జరగనున్న బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభకు 90 శాతం బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల వారు బాధ్యతగా తరలివచ్చి విజయవంతం చేయాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పిలుపునిచ్చారు.

బీసీలు సంఘటితం కావాలి

బీసీలు సంఘటిత శక్తి చాటాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ సూచించారు. హనుమకొండలోని కార్యాలయంలో మహాసభ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు.

బీసీలు తరలిరావాలి

హన్మకొండ చౌరస్తా: బీసీల యుద్ధభేరి సభకు బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని శ్రీభక్తమార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు కోరారు. రెడ్డికాలనీలోని సంఘం భవన్‌లో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

యుద్ధభేరి సభకు సగరుల మద్దతు

నయీంనగర్: బీసీ రాజకీయ యుద్ధభేరి సభను సగర కులస్తులు మద్దతు తెలుపుతూ, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ సగర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నలుబోల సతీష్ పిలుపునిచ్చారు.

కోటలో వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: యుద్ధభేరిని విజవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్ పిలుపునిచ్చారు. వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

కాజీపేట: బీసీ ఆజాద్ సైకిల్ యాత్రను కాజీపేట ప్రధాన రహదారిపై డాక్టర్ కె.వెంకటస్వామి జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. బీసీ గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ట్రైసిటీలో సైకిళ్లపై యాత్ర చేయనున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



కప్ అందజేస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: క్రీడల్లో గెలుపోటములు సహజమని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బల్దియా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన ప్రజారోగ్యం, రన్నర్‌గా నిలిచిన టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, అడిషనల్ కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, సిటీ ప్లానర్ రవీందర్ వాడేకర్, ఎంహెచ్ఓ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లారీ కిరాయిల పెంపునకు నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ఖిలా వరంగల్: ఫిబ్రవరి 1వ తేదీ నుంచి లారీ కిరాయిల పెంపునకు అసోసియేషన్ నిర్ణయం తీసుకున్నట్లు ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనిగరం శ్రీహరి, గోరెమియా, బొరిశెట్టి నారాయణ తెలిపారు. వరంగల్‌లో ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వేముల శ్రీకాంత్ అధ్యక్షతన లారీ ఓనర్లు, వ్యాపారులు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లారీ ఓనర్లు, వ్యాపారుల మధ్య డిసెంబర్ 18 వరకు జరిగిన ఒప్పందం ముగిసిందన్నారు. నూతనంగా ఒప్పందం ప్రకారం ఫిబ్రవరి 1నుంచి పెరిగిన 8శాతం కిరాయిలు అమల్లోకి వస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎండీ.నాయబ్, సోహెల్, మోహిన్, అజీమ్, ఠాగూర్, రాకేష్ సింగ్, శంకర్, ఎనబోతుల శ్రీకాంత్, ఎండి. షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు వద్దు

హన్మకొండ చౌరస్తా: ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరపాలని ఇంటర్ బోర్డు పెట్టిన కొత్త నిబంధనతో విద్యార్థులు మానసిక ఆందోళన గురవుతారని, దీన్ని వెంటనే రద్దు చేయాలని వరంగల్ ప్రైవేట్ జూనియర్ కాలేజీ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ, పీజీ ప్రాక్టికల్లో సీసీ కెమెరాల నిబంధన లేదని, కేవలం ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని కొత్తగా నిబంధన పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో వరంగల్ ప్రైవేట్ జూనియర్ కాలేజీ అసోసియేషన్ అధ్యక్షుడు వద్దిరాజు సత్యనారాయణరెడ్డి, సభ్యులు కుమార్, వేణుగోపాల్ గౌడ్, అశోక్‌రెడ్డి, రాజు, సురేందర్‌రెడ్డి, నరేందర్, కర్ణాకర్, చంద్రమౌళి, సందీప్, మహేష్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేయూ రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ రాంచంద్రానికి వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో కేయూ ఫైనాన్స్ ఆఫీసర్ తోట రాజయ్య, కేయూ ఎన్‌జీఓ అధ్యక్షుడు యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి, బాధ్యులు యూనస్, సతీష్, ప్రభాకర్, నిరంజన్, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ బాధ్యులు షకూర్, దూరవిద్యా కేంద్రం సైన్స్ కోర్సుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటగోపినాథ్, ప్రొఫెసర్లు ఉన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి



సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు

వరంగల్ చౌరస్తా: నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో సీఐటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాగర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, నాయకులు నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ మాట్లాడారు. ఈనెల 5వ తేదీని కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంకటి శ్యామ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనతో స్థానిక ఎన్నికలు జరగాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

వరంగల్ చౌరస్తా: కులగణన సంఖ్య ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ్ల ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ రోడ్డులోని ఐరన్ అండ్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించినట్లు వెల్లడించారు. సమావేశంలో నాయకులు వెంకట్రాములు, నేదునూరి రాజమౌళి, ప్రమీల, తాటి వెంకటేశ్వర్లు, వనం సత్యనారాయణ, వెంకటయ్య, పంజాల రమేష్, వలబోజు వెంకన్న, ఓర్సు రాజు, చీకటి ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, మేకల రవి, పనాస ప్రసాద్, సీపీఐ కార్యదర్శి, సహాయ కార్యదర్శి సౌహార్థ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

యూనివర్సిటీల్లో ఉద్యోగాలు భర్తీచేయాలి

కేయూ క్యాంపస్: ఆయా యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. కేయూలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల ప్రొఫెసర్ల వయోపరిమితి పెంపుపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. వర్సిటీల్లోని ఉద్యోగాల భర్తీపై ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు చిరంజీవి, కరుణాకర్, సంతోష్, వర్ధన్, రాకేష్, అనిల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కేయూ క్యాంపస్: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, విద్యతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లో ఆసక్తిని పెంచుకొని రాణించాలని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ రమ సూచించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో భారత్ క్రీడోత్సవాల్లో భాగంగా కేయూలో క్రీడాపోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, కన్వీనర్ గట్టు ప్రశాంత్, సాయికుమార్, పూజ, సాయిప్రియ, ఎలేంద్ర, అంబాల కిరణ్, చట్ల సతీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాల పెంపుపై హర్షం

కాజీపేట రూరల్: మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుపై సీఐటీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృషిచేసిన గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీఎంహెచ్ఓలకు కృతజ్ఞతలు తెలిపారు. కాజీపేట 47వ డివిజన్ ఇంపీరియల్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మండల అధ్యక్షుడు రొంటాల కోటేశ్వర్, యూనియన్ హనుమకొండ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరికెళ్ల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎర్ర నరేష్, టి.సునిల్, అనుదీప్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ వీధి పిల్లల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని అర్బన్ డిప్రవడ్ రెసిడెన్షియల్ స్కూల్ పిల్లలకు కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి శుక్రవారం నోట్ పుస్తకాలు, పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది పిల్లలకు విద్య, సరైన భోజనం అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జ్ దీప, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

హసన్‌పర్తి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిరసన తెలుపుతున్నట్లు తెలిపారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కర్ణాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ రాంచందర్, గురుచరణ్‌సింగ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన కాయిత జంపయ్య.. మడికొండ శివారులోని వ్యవసాయ భూమిలో జనవరి 28న పనిచేస్తుండగా కాయిత కుమార్ అలియాస్ సుక్కయ్యకు మధ్య గొడవ జరిగింది. జంపయ్యపై రేగు కంపతో కాయిత కుమార్ దాడి చేయగా, పోలీసులు అక్కడికి చేరుకుని జంపయ్యను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడి కుమారుడు కాయిత అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ రెడ్డి (ACO) : 9177258410 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)